సాక్షి
అనకాపల్లి
సోమవారం । 4 । ఆగస్టు । 2025



15 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 15,16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్టు హరేకృష్ణ సత్సంగ ఆశ్రమ నిర్వాహకు తెలిపారు. 8లో



అరకు ఇక రాయగడకే!

అరకు ఇప్పుడు రాయగడ పరమైపోయింది. వాల్తేరు రైల్వే డివిజన్‌లో భాగంగా ఉన్న అరకు.. కొత్త డివిజన్‌లో చేరుతోంది. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- అర్జీలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, సమస్యలపై ప్రజలు కలెక్టరేట్‌లో అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, మున్సిపల్, డివిజనల్ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్టు తెలిపారు. అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు అనివార్య కారణాల వల్ల ప్రభుత్వ కార్యాలయాలకు రాలేనివారు ఆన్‌లైన్ ద్వారా meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్1100 కు కాల్ చేసి తెలుసుకోవచ్చని, అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఉత్సాహంగా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్



పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి నరేష్

అనకాపల్లి టౌన్: స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాదులను నాలుగు టీములుగా విభజించి ఏఎంఏఎల్ కళాశాల గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పదోఅదనపు జిల్లా జడ్జి నరేష్, అడిషనల్ సబ్ కోర్ట్ జడ్జి రామకృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు, కార్యదర్శి బంధం రమణ, ఉపాధ్యక్షుడు సంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

అనకాపల్లి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకూ స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్.వి.రమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల యువకులు, మహిళలు పోటీల్లో పాల్గోవచ్చని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు విశాఖలో ఈనెల 11 నుంచి 14 వరకూ జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, జోనల్ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు 16 నుంచి 20 వరకూ విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885530819, 8125416870 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

- ఎమ్మెల్యే సోదరుడి అనుచరుల గ్రావెల్ దందా
- భారీ యంత్రాలతో వెదురువాడలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు
- ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి పెద్ద ఎత్తున అక్రమంగా తరలింపు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు, నేతలపై గూండాగిరీ
- చోద్యం చూస్తున్న ఏపీఐఐసీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు
- ఏపీఐఐసీ అధికారికి రోజు వారి మామ్మూళ్లు!

“కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార పార్టీ నేతలు బరి తెగిస్తున్నారు. కన్నుమిన్నుకానకుండా రెచ్చిపోతున్నారు. కొండలను తవ్వి పిండి చేస్తున్నారు. చెరువులను గుల్ల చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. మామూళ్లతో అధికారుల కళ్లకు గంతలు కట్టి మరీ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసుల అండదండలతో రెచ్చిపోతున్నారు. అడ్డుకుంటున్న గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నేతలపై గూండాగిరీకి దిగుతూ, లారీలతో ఢీకొని అడ్డు తొలగించుకునేలా **దౌర్జన్యానికి పాల్పడుతున్నారు.**”



సానా రెచ్చిపోతున్నారు!



గ్రావెల్ తవ్వకాలకు తీసుకొచ్చిన పొక్లెయిన్



కొండను పిండి చేసిన అక్రమార్కులు



అడ్డుకున్న నర్మల్‌కుమార్‌పై గూండాగిరీ చేస్తున్న సతీష్‌కుమార్ అనుచరుడు కొరుప్రోలు సరోజీరావు



గ్రావెల్ తవ్వకాలపై కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేస్తున్న నర్మల్‌కుమార్

సాక్షి, అనకాపల్లి: పారిశ్రామిక ప్రాంతమైన అచ్యుతాపురం మండల పరిధిలో రాత్రీపగలు తేడా లేకుండా గ్రావెల్ మాఫియా రోజు రోజుకూ రెచ్చిపోతోంది. అధికారుల అండదండలతో ఇష్టానుసారంగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. పెద్ద పెద్ద చైన్ పొక్లెయిన్లతో యథేచ్ఛగా కొండలను పిండి చేస్తున్నారు. స్థానిక జనసేన ఎమ్మెల్యే సోదరుడు సతీష్‌కుమార్ అనుచరులే దందాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఈ నెల 2వ తేదీ శనివారం అర్ధరాత్రి వెదురువాడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్-1లో ఉన్న కొండ వద్ద నాలుగు పెద్ద పొక్లెయిన్ల (200-మిషన్ల)తో గ్రావెల్ తవ్వకాలు జరిపి, 30కి పైగా లారీలతో అక్రమంగా తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీ కోఆప్షన్ నర్మల్ కుమార్, మండల యువజన అధ్యక్షుడు గంగోలి శ్రీనుతో పాటు గ్రామస్తులు ఆ ప్రాంతానికి వెళ్లి లారీలను అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే సోదరుడి అనుచరుడు సరోజీరావు రెచ్చిపోయారని, గూండాగిరీ చేస్తూ కుమార్ తదితరులను లారీతో తొక్కించేయాలని డ్రైవర్లను ఆదేశిస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు. ఈ తరలింపు వెనుక స్థానిక జనసేన ఎమ్మెల్యే సోదరుడు సతీష్‌కుమార్ అనుచరుడు కొరుప్రోలు చిన్నారావు, ఆయన సోదరుడు సరోజీరావు హస్తం ఉందని వైఎస్సార్‌సీపీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు కుమార్ ఆరోపించారు. గత కొంత కాలంగా ఇక్కడ పెద్ద ఎత్తున గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆ ప్రాంత వాసులు తెలిపారు.

ఫిర్యాదు చేసినా..

అచ్యుతాపురం సెజ్ పరిశ్రమలను ఆనుకుని ఉన్న మడుతూరు, ఇరువాడ, యర్రవరం, ఉప్పవరం, జగన్నాథపురం, నడింపల్లి గ్రామాల్లో ఉన్న చెరువులు, కొండలను సైతం పొక్లెయిన్లతో తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయా గ్రామస్తులు తెలిపారు.

పోలీసుల అండదండలతో..

అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే, పోలీసుల అండదండలతోనే గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. శనివారం రాత్రి 10 గంటలకు గ్రావెల్ తవ్వుతున్నట్టు ఫోన్ రావడంతో అక్కడికి జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు కుమార్, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గంగోలి శ్రీను వెళ్లి అడ్డుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే సోదరుడు సతీష్ కుమార్ అనుచరుడు కొరుప్రోలు సరోజీరావు గూండాగిరీ చేశాడని, లారీతో తొక్కించేయాలంటూ డ్రైవర్‌కు చెప్పి అడ్డు తొలగించేందుకు ప్రయత్నించారని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు హోంగార్డులు శంకరరావు, అప్పారావు ప్రేక్షకపాత్ర పోషించారే తప్ప అక్రమ గ్రావెల్ తవ్వకాలను నిలువరించలేదని చెప్పారు. అంతే కాకుండా అడ్డుకునేందుకు వచ్చిన వారిని తమ సీఐ గారికి ఫోన్ చేయాలంటూ చెప్పి మిన్నకుండిపోయారని తెలిపారు. ఈ వ్యవహారమంతా పోలీసుల అండదండలతో సాగుతోందని వారు ఆరోపించారు.

అధికారులకు ముడుపులు..!

ఎటువంటి అనుమతులు.. అడ్డూ అదుపూ లేకుండా కొండలను పిండి చేస్తున్నా మైనింగ్, పోలీస్, ఏపీఐఐసీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడమే కాకుండా పర్యావరణాన్ని కూడా కలుషితం చేస్తున్నారు. కాగా మైనింగ్, పోలీస్, రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు నెలవారీ మామూళ్లు చెల్లించి మరీ గ్రావెల్‌ను దోచుకుంటున్నట్లు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో అనుమతుల్లేకుండా ఎక్కడ పడితే అక్కడ అక్రమార్కులు కొండలను, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారు. ఎవరైనా స్థానికులు అడ్డగిస్తే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. స్థానికులెవరైనా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. నేరుగా తవ్వకందారులకే సమాచారం ఇచ్చి నామమాత్రంగా తనిఖీలు చేయడానికి వెళ్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోజుకు 400 ట్రిప్‌లు..

అచ్యుతాపురం మండలం వెదురువాడ సర్వే నంబర్ 1లో గత కొన్ని రోజులుగా కూటమి ఎమ్మెల్యే సోదరుడి అనుచరులు కొండను అక్రమంగా తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. నాలుగు 200 చైన్ జేసీబీ మెషీన్లతో 30కి పైగా లారీలతో రోజుకు 400కు పైగా ట్రిప్‌లు తరలిస్తున్నారని, ఈ వ్యవహారమంతా రాత్రి పూట సాగుతోందని గ్రామస్తులు తెలిపారు. ఒక ట్రిప్‌కు 30 టన్నుల గ్రావెల్ చొప్పున ఒక్కో లారీతో 10 ట్రిప్‌ల వరకూ అక్రమంగా తరలించేస్తున్నారని తెలిపారు. సుమారు 12 వేల టన్నుల గ్రావెల్‌ను రోజూ అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం. సుమారు ఏడాది కాలంగా కొండకర్ల నుంచి గోకువాడ వరకు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ కొండ తవ్వి రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల విలువ చేసే గ్రావెల్ తరలించారని భోగట్టా. అంతే కాకుండా సమీపంలో గల ఎర్రవరం, జగన్నాథపురం, నడింపల్లి, మడుచూరు, వెంకటాపురం, చీమలాపల్లి గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒక లారీ గ్రావెల్‌ను రూ.9 వేల చొప్పున విక్రయిస్తూ జేబు లు నింపుకుంటున్నారు.

అడ్డుకున్నానని లారీతో తొక్కించి చంపే యత్నం..

ప్రతి శని, ఆదివారాల్లో రాత్రంతా భారీగా గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. అధికారుల అండదండలతోనే గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. ఈ నెల 2వ తేదీన భారీ వాహనాలతో గ్రావెల్ తవ్వుతుంటే మేము అడ్డుకున్నాం. నాపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా.. లారీతో తొక్కించుకుంటూ వెళ్లాలని డ్రైవర్లను ఆదేశిస్తూ గూండాగిరీకి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ గ్రావెల్ మాఫియాను అడ్డుకుని తీరతాం. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని గతంలో చాలా సార్లు మైనింగ్, ఇతర అధికారులను ఫిర్యాదు చేశాం. కలెక్టర్ విజయకృష్ణన్, మైనింగ్ ఏడీ, పోలీసులు, రెవెన్యూ అధికారులను కూడా కోరుతాం. ఇక్కడ జరుగుతున్న అవినీతిపై మా పార్టీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ, మండల అధ్యక్షులు, ఎంపీపీలు, పార్టీ కేడర్ అంతా ఉద్యమం చేసైనా ఈ ప్రాంతాన్ని కాపాడుకుంటాం. అక్రమార్కులపై చర్యలు తీసుకునే వరకూ మా పోరాటం, ఉద్యమం ఆగదు.

– నర్మల్‌కుమార్, జెడ్పీ. కోఆప్షన్ సభ్యుడు

విశాఖ భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలి

మంత్రి అనగానికి స్పీకర్ అయ్యన్న లేఖ

నర్సీపట్నం: విశాఖలో భూఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశిస్తూ రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు లేఖ రాశారు. మాజీ సైనికులకు చెందిన భూములకు సంబంధించి అనుమతి పత్రాల జారీ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ..అందులో తన పేరును కూడా విశాఖలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రస్తావించినట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో విశాఖపట్నం రూరల్ మండలంలో ఎండాడ-2 లో సర్వే నంబర్.14-1లో 5 ఎకరాల10 సెంట్ల భూమికి సంబంధించిన ఎన్‌వోసీ జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2014-19 లో కూడా విశాఖలోని భూఆక్రమణలపై అయ్యన్నపాత్రుడు మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆర్థిక రాజధానిగా, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఎంతో విలువైన భూములు ఆక్రమించుకుంటున్న నేపథ్యంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ స్పీకర్ లేఖ రాయడం చర్చనీయాంశమైంది.

పసుపు కొమ్ములతో అమ్మకు అలంకరణ



పసుపు కొమ్ముల అలంకరణతో ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో పసుపుకొమ్ములతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి

- వైద్యం కోసం వస్తే.. రోగులకు వ్యథలే..
- అధికారుల మధ్య ఆధిపత్య పోరు
- ఓ పరిపాలనాధికారి పనితీరుపై విమర్శలు
- అవినీతి, వర్గ విభేదాలు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు

కేజీహెచ్‌కు అనారోగ్యం





వివిధ పరీక్షల కోసం బారులు తీరిన రోగులు

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాలకే పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) సమస్యల వలయంలో చిక్కుకుంది. ఉత్తరాంధ్ర నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అలాగే ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. అయితే పెరిగిన రోగుల తాకిడికి అనుగుణంగా వైద్య సేవలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాలనా వైఫల్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఆసుపత్రిలో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఆసుపత్రిలో 1,187 పడకలు ఉండగా, సోమవారం నుంచి శనివారం వరకు రోజూ 1,500 నుంచి 2,200 మంది ఓపీ టికెట్లు తీసుకుంటున్నారు. వీరిలో 300 నుంచి 600 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వార్డులు, పడకల సంఖ్యను పెంచాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు శూన్యం. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూడా యాజమాన్యం విఫలమవుతోంది. కొన్ని చోట్ల రోగులు కుక్కలతో కలిసి ఉండాల్సిన దుస్థితి నెలకొంది.



వైద్యం కోసం గంటల తరబడి నిరీక్షణ

కష్టపడి ఓపీ టికెట్టు సంపాదించి సంబంధిత విభాగానికి వెళ్తే.. వైద్యుడిని సంప్రదించడానికి గంటకు పైగా సమయం పడుతోంది. క్యాజువాలిటీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, ప్రసూతి, చిన్నపిల్లల వార్డు, క్రిటికల్ కేర్ విభాగం .. ఇలా ప్రతి విభాగంలోనూ వందలాది మంది రోగులు బారులుదీరి ఉంటారు. రోగులకు వైద్యం బాగానే అందిస్తున్నా.. డాక్టర్ వద్దకు చేరుకోవడానికే చాలా సమయం పడుతోంది. ఇటీవల 43 మంది వైద్యులు, 26 మంది స్టాఫ్ నర్సులు బదిలీ అయ్యారు. కొత్త నియామకాలు జరగకపోవడంతో వైద్యులు, నర్సుల కొరత తీవ్రంగా ఉంది. పలు విభాగాల్లో విభాగాధిపతులు(హెచ్‌వోడీ) అందుబాటులో లేకపోవడంతో అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో, కొన్నిచోట్ల పీజీ విద్యార్థులతో ఓపీలు నడుస్తున్నాయి. కొందరు వైద్యులు సమయానికి రాకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

నిర్లక్ష్యానికి కేరాఫ్‌గా క్యాజువాలిటీ

ఆసుపత్రికే గుండెకాయ లాంటి క్యాజువాలిటీ విభాగం నిర్లక్ష్యానికి నిలయంగా మారింది. రోడ్డు ప్రమాద బాధితులు, అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైనవారు ఇక్కడికి వస్తే, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. క్షతగాత్రులు, రోగులను లోపలికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్, వీల్ చైర్ కోసం కూడా బంధువులే వెతుక్కోవాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. దీంతో క్షతగాత్రులు రక్తం కారుతూ.. బాధను ఓర్చుకుంటూ ఆటోల్లో, అంబులెన్స్‌ల్లో అప్పటి వరకు ఉండాల్సిన పరిస్థితి ఉంది. సిబ్బంది నిర్లక్ష్యం, విసుగు ప్రదర్శిస్తుండటంతో అత్యంత విలువైన 'గోల్డెన్ అవర్' వృథా అయి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోంది. ఒకవేళ రోగి మరణిస్తే, మృతదేహాన్ని గంటల తరబడి అక్కడే స్ట్రెచర్‌పై వదిలేస్తున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి.

దుర్గంధభరితంగా వార్డులు

పారిశుధ్య పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో ఆసుపత్రిలోని అనేక వార్డులు కంపుకొడుతున్నాయి. రాజేంద్రప్రసాద్ వార్డు, భవానగర్ వార్డు, గైనిక్ వార్డు, పిల్లల వార్డు, ఆర్థోపెడిక్ వార్డుల్లో మరుగుదొడ్ల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. ఎవరైనా పర్యవేక్షణ చేస్తారంటే శుభ్రం చేస్తారు. లేదంటే పట్టించుకోరు. దీంతో అపరిశుభ్ర వాతావరణంలోనే రోగులు, వారి బంధువులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

ఆధిపత్య పోరు.. అవినీతి ఆరోపణలు

ఆసుపత్రిలో అధికారుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఆసుపత్రిని పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ తన చాంబర్ నుంచి బయటకు రావడం గగనంలా మారింది. విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎవరికీ అప్పగించలేదు. అడ్మినిస్ట్రేటర్‌గా వచ్చిన ఓ అధికారి పనితీరు మీద విమర్శలు వస్తున్నాయి. పరిపాలనను పట్టించుకోకుండా ఆస్పత్రిలో ఒక వర్గాన్ని చేతిలో పెట్టుకుని వివాదాలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి, వర్గ విభేదాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉండటంతో పాలన గాడి తప్పింది. తరచూ విద్యుత్ అంతరాయాలు, పనిచేయని ఏసీలు, ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ లోపాలు, పారిశుధ్య సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారు. ఆస్పత్రికి 'నేనే బాస్' అంటే 'నేనే బాస్'అనే ధోరణిలో అధికారుల మధ్య నెలకొన్న పోరుతో ఇక్కడ వైద్య సేవలు, పరిపాలన అస్తవ్యస్తంగా మారాయి.





రోగులను తరలించే స్ట్రెచర్లపై సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

‘ఉచిత బస్సు’ అమలు చేస్తే మా గతేంకాను



నరసింగబిల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో, మోటారు కార్మికుల నిరసన ప్రదర్శన

కశింకోట: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే మా గతేం కావాలని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం వల్ల ఆటో, వ్యాన్, టాక్సీ తదితర మోటారు వాహనాల మీద ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నరసింగబిల్లి వద్ద జాతీయ రహదారిపై ఆటో, మోటారు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమానికి నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలు పేరుతో ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రకటించారన్నారు. దీనివల్ల ఆటో, వ్యాన్, టాక్సీ తదితర మోటారు వాహనాల మీద ఆధారపడి జీవనం సాగించే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. పలువురు ఉన్నత చదువులు చదివి సరైన ఉద్యోగ అవకాశాలు లేక ఆటో, వ్యాన్, టాక్సీలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేసి వడ్డీలు కట్టలేక, సర్వీసు లేక సతమతమవుతున్నట్టు తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలు, విడి భాగాల ధరలు, బీమా చలానాలు, టాక్స్‌లు విపరీతంగా పెరగడం, మరో పక్క పోలీసులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు కేసులు బనాయిస్తుండటం వల్ల రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము వాటికే ఖర్చు అయిపోతుందన్నారు. ఇంటి అవసరాలకు డబ్బులేక అర్ధాకలితో కుటుంబాలు అలమటించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడుందని చెప్పారు. వీటిని గుర్తించి ఆటో,మోటారు కార్మికులను ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు శివశంకర్, ఎం.వర, ఎం.శ్రీను, ఎం. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడి పందాల శిబిరాలపై దాడులు


కోడి పందాలు నిర్వహిస్తున్న వ్యక్తులతో రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం : తోటకూరపాలెం గ్రామంలో కోడి పందాలు శిబిరాలపై రావికమతం ఎస్ఐ రఘువర్మ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను, పంగిడి గ్రామానికి చెందిన ఒక్క వ్యక్తి, మాకవరపాలెం గ్రామానికి చెందిన మరో వ్యక్తిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ1,750 నగదు, ఐదు కోళ్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రఘువర్మ తెలిపారు.

మార్టూరులో వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్ : మార్టూరు గ్రామంలో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నడిపల్లి శ్రీను(28) ఫ్యాన్‌కు చీరతో ఆదివారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఈ మేరకు మృతుడు భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అడ్డగోలు జీవోలు.. అణచివేతకు కుట్రలు!

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వానికి భయం మొదలైంది
- పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను నిషేధిస్తూ ఇచ్చిన జీవో ప్రజాస్వామ్య విరుద్ధం
- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగిన ఏఐఎస్ఎఫ్


నిరసన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వానికి ఏడాది కాలంలోనే భయం మొదలైందని అందుకు నిదర్శనమే పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించిందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్ అన్నారు. ఆదివారం విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లోకి ప్రవేశం లేదని జీవో విడుదల చేయడాన్ని ఖండించారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, న్యాయమైన సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పాఠశాలల్లోకి అనుమతించకపోవడం కూటమి నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం అడ్డగోలుగా జీవోలు ఇస్తూ అణచివేతకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా విద్యార్థులకు అండగా ఉంటామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అరకు ఇక రాయగడకే!

ఆదాయాన్నిచ్చే కొరాపుట్ మార్గం కూడా రాయగడ పరిధిలోకి..

అరకు కోసం వినతులిచ్చినా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం

వాల్తేరు నుంచి కొత్త డివిజన్‌లో చేర్చిన రైల్వే బోర్డు



సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రా ఊటీ అరకు ఇప్పుడు రాయగడ పరమైపోయింది. వాల్తేరు రైల్వే డివిజన్‌లో భాగంగా ఉన్న అరకు.. జోన్ విభజన తర్వాత కొత్త డివిజన్‌లో చేరుతోంది. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా వాల్తేరు డివిజన్ నుంచి మేజర్ భాగాలను విడదీసి రాయగడ డివిజన్‌లో కొంత, విశాఖ డివిజన్‌లో మరికొంత భాగాన్ని విలీనం చేయాలన్న తుది డీపీఆర్‌కూ బోర్డు ఆమోద ముద్ర వేసేసింది. ఇక గెజిట్ వచ్చేస్తే.. చారిత్రక వాల్తేరు కనుమరుగుకు.. అరకు ప్రాంతం రాయగడకు ఇక అధికారికంగా రాజముద్ర పడిపోయినట్లే. ఆదాయాన్నిచ్చే అరకు, కొరాపుట్ మార్గాలను విశాఖ డివిజన్‌లో ఉంచాలన్న వినతులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రకు రిక్తహస్తాలు చూపించింది.

వాల్తేరు డివిజన్‌ను విడదీసేసి..

రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాల్తేరు డివిజన్ విభజన తథ్యం అన్నట్లుగా రైల్వే బోర్డు ముందుగానే సంకేతాలిచ్చింది. ఇందులో భాగంగా వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవలే వైజాగ్ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు ప్రధాని శంకు స్థాపన చేశారు. ఇటీవలే మార్పులు చేసిన డీపీఆర్‌ని కూడా బోర్డు ఆమోదించేసింది. వాల్తేరును కొనసాగించాలని ఒత్తిడి తీసుకొచ్చినా దాన్ని పెడచెవిన పెట్టేసింది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త డివిజన్‌కు డీపీఆర్‌లో స్పష్టం చేసింది.

410 చ.కి.మీ మేర విశాఖ డివిజన్

సరిహద్దుల విషయంలో బోర్డు కఠినంగా వ్యవహరించింది. గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు గుణుపూర్- పర్లాఖిముండి సెక్షన్ సహా, నౌపడ-గుణుపూర్ లైన్‌ని కొత్తగా ఏర్పాటవుతున్న విశాఖ డివిజన్‌లో ఉంచాలని ప్రతిపాదించారు. కానీ దీన్ని బోర్డు అంగీకరించలేదు. సుమారు 410 చ.కి.మీ మేర విశాఖపట్నం డివిజన్‌గా ఏర్పాటు కానుంది. వాల్తేరులోని మిగిలిన భాగమైన కొత్తవలస నుంచి కిరండూల్, కూనేరు-తెరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్ నుంచి కొరాపుట్ జంక్షన్, పర్లాఖిముండి నుంచి గుణుపూర్ వరకూ దాదాపు 680 కి.మీ మేర రాయగడ డివిజన్ పరిధిలోకి రాబోతోంది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ విశాఖపట్నం జోన్ నుంచి రాయగడలోకి వెళ్లిపోయింది. పార్వతీపురం సమీపంలోని కూనేరు కూడా రాయగడ డివిజన్‌కే ఇచ్చేశారు. కొత్తవలస నుంచి పలాస వరకు విశాఖపట్నం డివిజన్‌లో ఉంచారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టేషన్లన్నీ తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉన్నాయి. అరకు, కొరాపుట్ లైన్ విశాఖ డివిజన్‌కు ఇవ్వాలని ఎన్ని ప్రతిపాదనలు పంపించినా కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసేసింది.

గెజిట్ వచ్చేలోపైనా కూటమి కళ్లు తెరిస్తేనే..!

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. ఏటా మూడున్నర కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.15 వేల కోట్లు కాగా, ఇందులో రూ.8 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా రోజుకు రూ.25 లక్షలు వస్తోంది. ఇది భువనేశ్వర్ (రూ.12-14 లక్షలు) కంటే ఎక్కువ. దేశంలోనే 260 డీజిల్ ఇంజన్లున్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లుండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్ విశాఖ. ఇందులో సింహభాగం ఆదాయం ఐరన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. ఇదంతా రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. వాల్తేరుకు రావాల్సిన ఆదాయం దాదాపు సింహభాగం కోల్పోయినట్లే అవుతుంది. జోన్‌కు సంబంధించి ఇంకా గెజిట్ విడుదల కాలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఎంపీలు పట్టుబట్టి.. కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే విశాఖ డివిజన్‌కు మంచి జరిగే అవకాశం ఉంది. కానీ.. కూటమి నేతలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

- వివాహ వేడుకకు వస్తూ మృత్యు ఒడికి
- రైలు పట్టాలు దాటుతుండగా దుర్ఘటన


రైలు ఢీకొని మృతి చెందిన కొల్లి రమణమ్మ

యలమంచిలి రూరల్ : వివాహ వేడుకకు వస్తూ రైల్వే ట్రాక్ దాటుతున్న మహిళను గుర్తు తెలియని రైలు బండి ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో యలమంచిలి రైల్వేస్టేషన్ ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం సమీపంలో చోటు చేసుకుంది. విశాఖపట్నం తుంగ్లాం ప్రాంతానికి చెందిన కొల్లి రమణమ్మ(55), మరో ముగ్గురు బంధువులతో కలిసి యలమంచిలి రాంనగర్‌లో జరుగుతున్న ఓ వివాహానికి హాజరుకావడానికి ఆదివారం రాత్రి వచ్చారు. ఆటోలో యలమంచిలి రైల్వేస్టేషన్ వరకు వచ్చి రాంనగర్‌లో జరుగుతున్న వివాహ వేదిక చిరునామా సరిగ్గా తెలియకపోవడంతో తికమక పడ్డారు. చివరకు బంధువులకు ఫోన్ చేయగా రైల్వేస్టేషన్ చివర రైలు పట్టాలు దాటితే సులభంగా వివాహ వేదిక వద్దకు చేరుకోవచ్చని చెప్పారు. దీంతో మృతురాలితో పాటు ఇద్దరు మహిళలు, మనుమరాలు రైల్వే ట్రాక్ దాటుతుండగా అదే ట్రాక్‌పై అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు వేగంగా వస్తోంది. వారిలో ఇద్దరు రైలుపట్టాలు దాటేసరికి రైలు వస్తున్న సంగతిని చెప్పి మిగిలిన ఇద్దరినీ రావద్దని అరిచారు. ఇద్దరిలో ఒక మహిళ రైలు పట్టాల అవతల ఉండిపోగా, కొల్లి రమణమ్మ దాటే ప్రయత్నం చేసింది. అదే సమయంలో కాలి చెప్పు జారిపోవడంతో ఆమెను రైలు ఢీకొట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంలో రమణమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రెప్పపాటులో ముగ్గురు మహిళలు ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆనందంగా వివాహ వేడుకకు వచ్చిన రమణమ్మను రైలుబండి రూపంలో తమ కళ్ల ముందే మృత్యువు కబళించడంతో బంధువులు ఘటనా స్థలం వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీనిపై డ్యూటీలో ఉన్న స్టేషన్ సిబ్బంది తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మహిళ మృతి చెందిన రైల్వే ట్రాక్‌పై రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


గొర్లి నాగేశ్వరావు

అనకాపల్లి టౌన్ : మండలంలోని గోపాలపురం గ్రామంలో ఒక వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదైంది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాలివి. గొర్లి నాగేశ్వరావు(28) అనే వ్యక్తికి ఆరు నెలల క్రితం తీవ్రంగా కడుపు నొప్పి వస్తుండంతో పేగు సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి నొప్పి తగ్గలేదని ఇంటిలో ఎవరితోనూ సరిగా మాట్లాడక పోవడం, ఇంటిలో అయోమయంగా ఉండేవాడన్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇంటి నుంచి ఫోన్ తీసుకువెళ్లకుండా, తన ద్విచక్రవాహనంతో బయటకు వెళ్లి మరళా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులపై పునఃసమీక్షించాలి

బీచ్‌రోడ్డు(విశాఖ): రాష్ట్రంలోని పాఠశాలల ప్రాంగణాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశం నిషేధిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేయడం బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనగా భావిస్తున్నామని చైల్డ్‌రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె.ప్రవీణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులను, స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులను, ముందస్తు ప్రభుత్వ అనుమతులు పొందిన వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ..., రాజకీయ పార్టీల సభ్యులను నిరాకరిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమన్నరు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయాధికారి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎస్సీ కేటగిరీలో మిగిలిన సీట్లను ఆయా విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాలు పొందే గురుకులాలను సంప్రదించాలన్నారు.

రేషన్ కావాలంటే 4 కిలోమీటర్లు నడవాలి


సరుకులతో కావిళ్లు మోస్తూ నిరసన తెలియజేస్తున్న గిరిజనులు

రావికమతం : మండలంలోని పి.కోట్నాబిల్లిలో గిరిజనులు సరుకులను కావిళ్లు మోస్తూ ఆదివారం వినూత్న నిరసన తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ విధానానికి కుటమి సర్కార్ మంగళం పాడడంతో రావికమతం మండలంలో పి.కొట్నాబిల్లి గ్రామ గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కిలోమీటర్లు నడిచి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందని, సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో తలపై రేషన్ సరుకులు మూట మోస్తూ అష్టకష్టాలు పడుతున్నామని తెలిపారు. మండలంలో పి.కోట్నాబిల్లి గ్రామంలో కొండదొర తెగకు చెందిన 70 మంది కార్డుహోల్డర్స్ నివాసం ఉంటున్నారు. వీరు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి డోలవానిపాలెం గ్రామం నుంచి రేషన్ తెచ్చుకునేవారు. దీనిపై జూన్‌లో అధికారులకు విన్నవించగా, స్పందించిన నర్సీపట్నం ఆర్డీవో రామన్నదొరపాలెం డిపో నెంబర్ 039050 నుంచి పి.కొట్నాబిల్లి క్రియేటివిటీ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి బియ్యం సరఫరా చేయాలని సూచించారని, కానీ ఇప్పటి వరకూ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే స్టాక్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో మండల రెవిన్యూ కార్యాలయం వద్ద భారీ ఎత్తున అందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, గిరిజన సంఘం నాయకుడు పాడి బెన్నయ్య తదితరులు డిమాండ్ చేశారు.

18 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


మాట్లాడుతున్న కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసరావు

మునగపాక : నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజుల పాటు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన నాగులాపల్లిలో విలేకరుల సమావేశంలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్ జన్మదినం సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో చిత్తూరు. గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు సంబంధించి మహిళలు, పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ కె.ఎస్.వి. సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, టెక్నికల్ కమిటీ సభ్యులు ఎం.గణపతిరావు, కోచ్ శివ, కూటమి నేతలు దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురామ్, నాగేశ్వరరావు, మురళి, రాజేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శ్రీనివాస్ ఘనత


జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన శ్రీనివాస్

అనకాపల్లి : జాతీయ స్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకూ కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో మాస్టర్స్ మహిళలు, పురుషుల పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో అనకాపల్లికి చెందిన ఎం.శ్రీనివాస్(53) మాస్టర్స్ 2 కేటగిరిలో స్క్వాట్ 145.5 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 192.5 కేజీలు బరువు ఎత్తి ప్రథమస్థానం, రెండు నేషనల్ రికార్డులు, ఓవరాల్ గోల్డ్ మెడల్ సాధించారని అనకాపల్లి వేల్పులవీధి శ్రీరామదేవ వ్యాయమ జిమ్ కోచ్ వసాధి నానాజీ చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

అనకాపల్లి: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 15,16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్టు హరేకృష్ణ సత్సంగ ఆశ్రమ నిర్వాహకులు దుర్గభ కృష్ణప్రేమ దాస్ తెలిపారు. స్థానిక జాతీయ రహదారి సమీపంలో గల జగన్నాథ స్వామి ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి ఉత్సవం, సాయంత్రం కోలాటం, నృత్య ప్రదర్శనలు, 16వ తేదీ రాత్రి 8 గంటలకు మహా అభిషేకం, పంచామృత అభిషేకం, మహా కలశాభిషేకం, మహా మంగళ హారతి, ఊంజల సేవ, ప్రసాద వితరణ, 17వ తేద ఉదయం 10 గంటలకు శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావం, శ్రీల ప్రభుపాదులవారి 129వ జయంతి వేడుకలు, మహాఅభిషేకం, గురుపూజ, మహా మంగళ హారతి, మధ్యాహ్నం 12గంటలకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జన్మాష్టమి సందర్భంగా ఏడాదిపాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడ వాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రెండు గ్రామాల్లో వైద్యశిబిరాలు


విప్పలపాలెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది


గాదంపాలెంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గొలుగొండ : జ్వరాలతో బాధపడుతున్న విప్పలపాలెం, గాదంపాలెం గ్రామాల్లో ఆదివారం వైద్య శిబిరాలు నిర్వహించి, రక్త పరీక్షలు జరిపి, 38 మందికి మందులు అందజేశారు. 'జిల్లాకు జ్వరమొచ్చింది' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు గ్రామాల్లో డెంగ్యూ, చికున్ గున్యాతో బాధపడుతూ 80 మంది వరకూ మంచంపట్టారు. జ్వరపీడితలకు వైద్య పరీక్షలు జరపడంతో పాటు గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవోపీఆర్‌డీ బాబూరావు 'సాక్షి'కి తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకుల వీరంగం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై ఇద్దరు యువకులు దుర్భాషలాడుతూ వీరంగం చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. టౌన్‌షిప్ క్వార్టర్‌లో సీఐ కేశవరావు విశ్రాంతి తీసుకుంటుండగా అక్కడికి ఒక బైక్‌పై ముగ్గురు యువకులు వచ్చారు. క్వార్టర్ బయట ఉన్న జీపు డ్రైవర్ వద్దకు వెళ్లి సీఐ గురించి దుర్భాషలాడారు. సీఐను చంపేస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయాన్ని డ్రైవర్ టౌన్‌షిప్‌లో గస్తీ కాస్తున్న కానిస్టేబుల్ అప్పలరాజుకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతను సంఘటన స్థలానికి వచ్చి ఆ యువకులు వెళ్లిన వైపు వెళ్లారు. కొద్దిదూరంలో వారిని పట్టుకుని నిలదీశారు. వారిలో ఐ.రాజ్‌కుమార్, ఎస్.అజయ్‌కుమార్‌లు కానిస్టేబుల్‌పై కూడా దురుసుగా ప్రవర్తించి వీరంగం చేశారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారి కోసం గాలింపు చేపట్టారు.

ఫిరాయింపు కార్పొరేటర్లపై

వేటు వేయాల్సిందే..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు


జీవీఎంసీ కార్పొరేటర్లతో సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు చిత్రంలో డిప్యూటీ మేయర్ సతీష్, బానాల శ్రీనివాస్

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాల్సిందేనని ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు డిమాండ్ చేశారు. ఫిరాయింపు కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో వేసిన పిటిషన్‌పై సోమవారం తీర్పు వెలువడనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 6న జరగనున్న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికపై ఆ పార్టీ కార్పొరేటర్లతో కె.కె.రాజు సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే కార్పొరేటర్లకు ఎన్నికలో గెలుపునకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పార్టీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లు వేరొక పార్టీలోకి ఫిరాయిస్తే అది ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించినట్లవుతుందన్నారు. 'మా పార్టీ నుంచి ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్లపై అనర్హత వేటు అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. తీర్పు వెలువడితే వారి రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారనుంది. ఇలా ఫిరాయింపుదారులపై వేటు పడితేనే భవిష్యత్తులో ఎవరూ ఫిరాయించరు. ఒకవేళ ఫిరాయింపులకు పాల్పడాలనుకుంటే రాజీనామా చేసి, ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచి వెళ్లాలి'అని అన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటు హక్కును రద్దు చేయాలి

వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు నిర్ణయం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని డిప్యూటీ మేయర్ కె.సతీష్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్ ప్రశ్నించారు. తక్షణమే ఆ కార్పొరేటర్ల ఓటు హక్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించినప్పుడు ఆ పదవిని రద్దు చేసే అధికారం చట్టబద్ధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలోకి ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్ల అనర్హత అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఆ 27 మంది ఫిరాయింపు కార్పొరేటర్లకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఇప్పటికే నోటీసులు కూడా పంపించారని గుర్తు చేశారు. న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉండగా వారికి ఓటు హక్కు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని, ఒకవేళ ఎన్నిక నిర్వహించినా అది చెల్లదని హెచ్చరించారు.

అప్రజాస్వామికంగా మేయర్ ఎన్నిక

పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లతో అప్రజాస్వామికంగా కొత్త మేయర్‌ను ఎన్నుకున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యానికే తలవంపులు తెచ్చిన జంప్ జిలానీలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. కొత్త మేయర్ బాధ్యతలు స్వీకరించి వంద రోజులు కాకముందే ఆయన పనితీరు, అక్రమాలపై నగర ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. గత మేయర్ పాలనే బాగుందని నగర ప్రజలు భావిస్తున్నారన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల నియమ నిబంధనలను ముందుగా పోటీలో ఉన్న కార్పొరేటర్లకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో ఉన్న కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, సాడి పద్మారెడ్డి, మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి రామచంద్రరావు, నక్కిల లక్ష్మి, కె.వి.శశికళ, కోడిగుడ్ల పూర్ణిమ, పల్లా అప్పలకొండ, బిపిన్ కుమార్ జైన్, గుండాపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనకాపల్లిలో 100 అడుగుల మట్టి గణపతి విగ్రహం



120 అడుగుల వినాయక మండపం వద్ద నిర్వాహకులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 100 అడుగుల వినాయక భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, సంపత్ వినాయక ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు బుద్ద భూలోకనాయుడు తెలిపారు. ఆదివారం ఇక్కడ విగ్రహ నమూనాను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విగ్రహాన్ని పూర్తిగా మట్టితో లక్ష్మీగణపతి అవతారంలో తయారు చేయిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంతపెద్ద విగ్రహం ఎప్పుడు ఏర్పాటు చేయలేదన్నారు. తాపేశ్వరం లడ్డూను తీసుకొచ్చి స్వామివారి వద్ద ప్రత్యేక ఆకర్షణగా ఉంచుతామన్నారు. 120 అడుగుల ఎత్తులో పందిరి నిర్మిస్తున్నామన్నారు. 21 రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉగాది పురస్కార్ గ్రహీత, శిల్పి కామదేనువుప్రసాద్, సివిల్ ఇంజనీర్ బి.భానుప్రకాష్ పర్యవేక్షణలో భారీ విగ్రహ పనులు జరుగుతున్నాయన్నారు. 21 రోజులు స్వామివారి పూజలు అనంతరం స్థానికులు, ఫైర్ ఇంజన్ అధికారుల సహకారంతో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో గణపతి నిమజ్జనం చేస్తామన్నారు. కమిటీ సభ్యులు వాకాడ నర్సింగరావు, మద్దాల భాను, ముత్తా ఈశ్వరరావు, పి.గోవిందరావు, యల్లపు రాము, పిల్లా దుర్గాఆనందం, ఆళ్ల ప్రవీణ్, కాండ్రేగుల రవి, కాండ్రేగుల హైమావతి, అరుణారాణి, కె.కనకమహాలక్ష్మి, బి.జయంతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల రోడ్లకు ప్రారంభోత్సవం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్, విశ్రాంత ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణంతో మహర్దశ పట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. ప్రధాన రహదారి నుంచి కళాశాల ప్రాంగణం వరకు సుమారు రూ.58 లక్షల వీఎంఆర్డీఏ నిధులతో చేపట్టిన ఈ రోడ్లకు వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రిన్సిపాల్, విశ్రాంత ప్రిన్సిపాళ్లు ఆవిష్కరించారు. ఈ నిర్మాణాలకు కళాశాల విద్యాశాఖ పూర్వ కమిషనర్ పోలా భాస్కరరావు వీఎంఆర్డీఏను సంప్రదించి స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో చేపట్టేందుకు చేసిన కృషిని వివరించారు. పూర్తిస్థాయిలో రోడ్ల ఏర్పాటు కావడం విద్యార్థులకు సౌకర్యంగా మారిందన్నారు.

మోదమాంబ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి శ్రావణ ఆదివారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాలు అందజేసింది.

అనకాపల్లి సినిమాలు

రాజా : సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1:కింగ్ డమ్
సత్యనారాయణ స్క్రీన్-2 జూనియర్
పర్తిసాయి : మహావతార్ నరసింహ
వెంకటేశ్వర : లోపలకి రా చెప్పతా..
శ్రీ సత్య :తమ్ముడు
రామచంద్ర : హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 59 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-21, ఓ పాజిటివ్-29, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 237 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



వర్షం నీటితో నిండిన కన్నూరుపాలెం-కచ్చర్లపాలెం రోడ్డు



గోతులతో కన్నూరుపాలెం- కచ్చర్లపాలెం రోడ్డు

అడుగడుగునా గుంతలే..

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ● దారుణంగా కన్నూరుపాలెం- కచ్చర్లపాలెం రోడ్డు



కన్నూరుపాలెం వద్ద మలుపులో దెబ్బతిన్న రోడ్డు

కశింకోట: వాహనదారుడు రోడ్డెక్కాలంటే బెంబేలెత్తిపోతున్నాడు. ఏ రోడ్డు చూసినా గుంతలతో మృత్యువుకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇదే తరహాలో మండలంలోని కన్నూరుపాలెం- కచ్చర్లపాలెం వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. అడుగడుగునా గోతులు మయంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే గోతుల్లో నీరు చేరి అవి కాన రాకపోవడంతో ప్రమాదాలకు గురి కావలసిన పరిస్థితిని ఎదుర్కోనవలసి వస్తోంది. అయినప్పటికి ఈ విషయమై అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. దీంతో నిత్య కష్టాలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని కన్నూరుపాలెం కూడలి నుంచి తీడ శివారు కచ్చర్లపాలెం వెళ్లే రోడ్డు వరకు పంచాయతీ రాజ్ శాఖకు చెందిన రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు మార్గంలో తీడ, కచ్చర్లపాలెంతోపాటు చెరకాం, రెడ్డివానిపాలెం, తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరితోపాటు రావికమతం వెళ్లడానికి దగ్గరి మార్గం కావడంతో ఈ రోడ్డులో లారీలు, వ్యాన్లు, కార్లు, ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు దాదాపు దశాబ్దం కాలంగా గతుకులు పడి అధ్వానంగా ఉంది. భారీ వాహనాల ధాటికి ఇది మరింత దెబ్బతింది. పెద్ద గోతులు పడి ఉంది. ఏ మాత్రం వర్షం పడినా నీరు గోతుల్లో నిల్వ ఉండిపోతోంది. దీంతో వాహనాలు వాటిలో పడి దెబ్బతింటున్నాయి.

గోతుల్లో పడి ప్రమాదాలు

వాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణికులు ఒక్కొక్కసారి గోతుల్లో పడి ప్రమాదాలకు గురై క్షతగాత్రులు అవుతున్న సంఘటనలున్నాయి. ఈ విషయమై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహచ చోదకులు, స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ రోడ్డును గత వైఎస్సార్‌సీపీ హయాంలో పునర్నిర్మించడానికి ప్రయత్నాలు జరిగినప్పటికి ఇంతలో ఎన్నికలు రావడంతో కార్యాచరణలో ముందుకు సాగలేదు. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సంక్రాంతికి గోతులు లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికి ఆ హామీ ఇప్పటికి ఏడు నెలలు అవుతున్నా నెరవేరలేదు. దీంతో తమకు నిత్యం నరకయాతన తప్పడం లేదని, అత్యవసర సమయంలో వైద్యానికి రోగులను తరలించాలంటే ఆటో కార్మికులు గోతుల వల్ల ముందుకు రావడం లేదని, దీంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునర్నిర్మించడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

● ఈ ఏడాది సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్లు వేస్తామని, గతేడాది నవంబరు 2న పరవాడ మండలం వెన్నెలపాలెంలో ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు.
● రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి గుంతలు లేకుండా రోడ్లు నిర్మిస్తామని రహదారులు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి ఏలూరులో ప్రకటించారు.
● కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి పై విధంగా ప్రకటనలు చేయడమేగానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు.

దశాబ్ద కాలంగా గోతులు



కన్నూరుపాలెం-కచ్చర్లపాలెం రోడ్డు అధ్వానంగా ఉంది. సుమారు దశాబ్ద కాలంగా గోతులు పడి ఉండటం వల్ల వర్షం పడితే, వాటిలో నీరుచేరి కానక గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు మరమ్మతులకు గురై ఆర్థికంగా నష్టపోవలసి వస్తోంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బాగు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.రాజు, ఆటో డ్రైవర్, కన్నూరుపాలెం

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆంజనేయరాజు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మట్టి గణపతులను మాత్రమే పూజించాలని చింతామణి గణపతి దత్తక్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయరాజు తెలిపారు. పట్టణ పరిధి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్త విజయానంద తీర్థ స్వామిజీ దివ్యానుగ్రహంలో విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని గణపతి దత్తక్షేత్రంలో నవరాత్రులు ప్రత్యేక పూజలు, అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాగర తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెంలో సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. సండే వచ్చిందంటే చాలు సుదూర ప్రాంతాల నుంచి చాలా మంది ఆటవిడుపుగా పిల్లా పాపలతో తీర ప్రాంతాలకు చేరుకుంటారు. ఈ మధ్య కాలంలో ఎండలు మండుతుండటంతో తీర ప్రాంతాల్లో సేదదీరేందుకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఈ క్రమంలోనే ఆదివారం వివిధ ప్రాంతాలకు చెందినవారు ఇళ్ల నుంచే ఆహార పదార్థాలు వెంట తెచ్చుకుని, తీర ప్రాంతాలకు చేరుకొన్నారు. తీరంలో ఇసుక తిన్నెలపై ఆట పాటలతో గడిపి మధ్యాహ్నం భోజనం చేసి, సాయంత్రం వరకు సముద్ర స్నానాలతో సందడి చేశారు.

కూటమి పాలనలో ప్రతి ఒక్కరికీ అన్యాయమే

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్
● బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమానికి విశేష స్పందన



చంద్రబాబు మేనిఫెస్టో నమూనా కరపత్రాన్ని చూపించి జరిగిన మోసాన్ని వివరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



కూటమి ప్రభుత్వంలో తన కుటుంబ ఆధారం పోయిందని కన్నీరు పెట్టుకుంటున్న మహిళ

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వంలో ఎవరికీ మంచి జరగలేదని, కొందరికి ఉపాధి, మరికొందరికి సంక్షేమ పథకాలు పోయాయని, ఇలా ప్రతి ఒక్కరికీ అన్యాయమే జరిగిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక 83వ వార్డు పరిధి భీమునిగుమ్మం వీధిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ కూటమి పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న వ్యత్యాసం ప్రజలు గ్రహించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటూ మాయ మాటలు చెప్పారే తప్పా వాటిని ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు చేసే దాఖలాలు లేవన్నారు. ఏడాది పాలనలో విద్యుత్ చార్జీలు పెంచారని, నిత్యావసర ధరలు పెరిగాయని, కొత్తగా పింఛన్లు ఇవ్వలేదని, ఆడబిడ్డ నిధి చెల్లించలేదని, ఇలా అనేక పథకాలు ఎగ్గొట్టారని విమర్శించారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో భాగంగా అతడి వద్ద గాలి భారతి కన్నీరు పెట్టుకుంది. కూటమి ప్రభుత్వంలో తమ కుటుంబానికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటింటికి రేషన్ అందజేసే బండి తమకు జీవనాధారంగా ఉండేదని, ఇప్పుడు రోడ్డున పడ్డామని వాపోయింది. దీనికి భరత్‌కుమార్ బదులిస్తూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే మీ కష్టాలన్నీ తొలగిపోతాయన్నారు. 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, వాటిని ఇంటింటికి తీసుకువచ్చి అందజేసేవారన్నారు. 30 పథకాలను అందజేసి పాలనలో సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. అంతకుముందు భరత్‌కుమార్, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులను గజమాలతో స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, భీమినిగుమ్మం వీధి నాయకులు సమ్మంగి కనకారావు, పిట్లా అప్పలరాజు, కట్టా తులసి, తట్టా అరవింద్, సమ్మంగి సురేష్, కటారి మహేష్, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు గవరపాలెం అరుంధతీనగర్‌లో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ..

అనకాపల్లి: పట్టణంలోని 80వ వార్డు అరుంధతీనగర్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని కోరారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సత్తెమ్మతల్లిని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్



భారీ అన్నసమారాధన కార్యక్రమంలో పార్టీ నాయకులు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక గవరపాలెం దాసరిగెడ్డ రహదారిలో సత్తెమ్మతల్లి ఆలయ 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, జిల్లా వైద్య విభాగ అధ్యక్షుడు డాక్టర్ సిద్ధార్థ, ఆలయ గౌరవాధ్యక్షుడు యల్లపు వెంకటరమణ, అధ్యక్షుడు మద్దాల సీతారాం, కార్యదర్శి కాండ్రేగుల భీమేశ్వరరావు, కోశాధికారి దాడి వెంకయ్యానాయుడు, పార్టీ నియోజవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గైపూర్ రాజు, నాయకులు దండా జ్ఞానదీప్, కాండ్రేగుల హైమావతి, కాండ్రేగుల శ్యామ్, కాండ్రేగుల రమణబాబు, టీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు

నర్సీపట్నం : ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, బయపురెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలు ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఈ మహాసభల్లో మూడేళ్ల కాలంలో చేసిన ఉద్యమాన్ని సమీక్షించి, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, సంక్షేమ పథకాల అమలు, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణకు సంబంధించి నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. విద్యుత్ ఛార్జీల భారం, నిత్యవసర ధరలు పెరగడంతో కార్మికులు ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై తీవ్రమైన విద్యుత్ భారం పడడంతో పాటు జవాబుదారీతనం లేకుండా పోతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని రంగాల నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

తిరోగమనంలో విద్యా రంగం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశానికి హాజరైన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం తిరోగమనంలో ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంటు నేటికీ రాలేదన్నారు. విద్యార్థులు ఫీజులు కట్టలేదని కళాశాల యాజమాన్యాలు టీసీలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఒక్క డిగ్రీ కళాశాల లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం హాస్టళ్లను దత్తత తీసుకోవాలన్న ఆలోచన వెంటనే విరమించుకోవాలన్నారు. తల్లికి వందనం ఇప్పటికీ చాలా మందికి రాలేదని వాపోయారు. దీనివల్ల అనేక మంది తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే ఆలోచనలో భాగంగా నూతన విద్యా విధానాన్ని తీసుకువస్తున్నారని విమర్శించారు. సమావేశంలో విజయ్, వెంకటలక్ష్మి, దివాకర్, కృపానంద తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట



పందిరిరాట వేస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గడిచిన 42 ఏళ్లుగా వినాయకచవితి ఉత్సవాలను నిర్విరామంగా చేస్తున్నామని, ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. సంఘం వ్యవస్థాపకులు గంట్ల తమ్మయ్య, విగ్రహదాత కె.వి.నరసింహం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



హాస్య వల్లరి కామెడీ దృశ్యం



బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: పట్టణంతోపాటు మండలంలో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రింగ్ రోడ్డు జంక్షన్ నుంచి ఎన్టీఆర్ ఆస్పత్రి వరకూ లాంగ్ వాకింగ్ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలో ఓ ఫంక్షన్ హాల్లో క్లబ్ కుటుంబ సభ్యులు విశాఖ లాఫర్స్ ఫన్ క్లబ్ విశాఖపట్నం వారిచే హాస్య వల్లరి (కామెడీ స్కిట్స్ -జోక్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్లబ్ కుటుంబ సభ్యులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, చైర్మన్ పి.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్కికాన శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంటల తరబడి చెకింగ్‌తో ట్రాఫిక్ ఇక్కట్లు



రోడ్డుపై నిలిపిన ఎన్టీపీసీ మెటీరియల్ వాహనాలు

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు సమీపంలో తరచూ రోడ్డుపై నిలుపుతున్న మెటీరియల్ తరలించే భారీ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ముందే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాలను రోడ్డుపై వరుస క్రమంలో నిలిపేస్తున్నారు. ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద చెకింగ్‌లు పూర్తయితే తప్ప.. సెక్యూరిటీ సిబ్బంది వాహనాలను లోపలికి అనుమతించరు. వాహనాల చెకింగ్ గంటల తరబడి జరుగుతున్న నేపథ్యంలో అంతవరకు వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ఫార్మాసిటీ, హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు, పాఠశాలలు, కళాశాలల బస్సులు, వివిధ ప్రాంతాలకు వ్యాపార లావాదేవీలపై రాకపోకలు సాగించే వ్యాపారస్తులు, ఇతర ప్రయాణికులు నిత్యం ఇక్కట్లుపడుతున్నారు. రోడ్డు పక్కన నిలిపిన వాహనాల కారణంగా ఎదురెదురుగా భారీ వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సెక్యూరిటీ చెకింగ్ జరిగే వరకు సమీపంలోని లారీ యార్డ్‌లో వీటిని నిలపడం ద్వారా ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కవచ్చని స్థానికులు చెప్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఎన్టీపీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేదలపై స్మార్ట్ మీటర్ల భారం వొద్దు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వం పేదలపై స్మార్ట్‌మీటర్ల భారం వేసి వారి జీవితాలు బుగ్గిపాలు చేయొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో కరపత్రాలు పంచారు.